సెమీస్ లక్ష్యంగా..

నేడు ఆసియాకప్‌లో భారత్, యూఏఈ పోరు

దంబుల్లా(శ్రీలంక): ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ మరోపోరుకు సిద్ధమైంది. ఆదివారం తమ రెండో మ్యాచ్‌లో యూఏఈతో టీమ్‌ఇండియా తలపడనుంది. ఇప్పటికే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారీ విజయం సాధించి జోరుమీదున్న హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని భారత్..యూఏఈపై గెలిచి సెమీ ఫైనల్ బెర్తు ఖాయం చేసుకోవాలని చూస్తున్నది. పాయింట్ల పట్టికలో 2.29 రన్‌రేట్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమ్‌ఇండియా..యూఏఈపై గెలిస్తే సెమీస్‌లోకి దాదాపు అడుగు పెట్టినట్లే. పాక్‌తో మ్యాచ్‌లో దీప్తిశర్మ, స్మృతి మంధాన, రేణుకా సింగ్, షెఫాలీ వర్మ మెరుగ్గా రాణించారు. లక్ష్యఛేదనలో వర్మ, మంధాన మెరుగైన శుభారంభం అందించారు. పాక్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ అలవోకగా పరుగులు సాధించారు. టీ20 ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా భావిస్తున్న ఆసియాకప్‌లో తిరిగి టైటిల్ నిలబెట్టుకునేందుకు భారత్ తహతహలాడుతున్నది.

జేపీఎల్ జెర్సీల ఆవిష్కరణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్(జేపీఎల్) జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. శనివారం ఉదయం జింఖానా స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. పది జట్లకు చెందిన కెప్టెన్లు, ప్లేయర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ క్రీడారంగం అభివృద్ధికి, ప్లేయర్ల అభ్యున్నతి కోసం పనిచేసే జర్నలిస్టులు ఆటగాళ్లుగా మైదానంలోకి దిగడం చూస్తే సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భరత్‌రెడ్డి, ఆగంరావు, భరణి, సంజయ్, శరత్ పాల్గొన్నారు.

సాజిదాకు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీ వేదికగా జరుగుతున్న పాన్ అమెరికన్ ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో రాష్ట్రానికి చెందిన షేక్ సాజిదా స్వర్ణంతో సహా రజతంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 100మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బరిలోకి దిగిన సాజిద 3:31: 54సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకంతో సొంతం చేసుకుంది. అదే జోరు కొనసాగిస్తూ 100మీటర్ల ఫ్రీస్టయిల్ రేసులో సాజిద 01:44:43 సెకన్లతో కాంస్యం ఖాతాలో వేసుకుంది. పాన్ అమెరికా గేమ్స్‌లో పతకాలు సాధించిన సాజిద దేశ ఖ్యాతిని, గౌరవాన్ని ఇనుమడింపజేసింది.

గోవర్ధన్ పతక జోరు

మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా 15వ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ సెయిలర్ గోవర్ధన్ పతక జోరు కనబరిచాడు. శనివారం ముగిసిన టోర్నీలో బాలుర అండర్-16 అప్టిమిస్టిక్ విభాగంలో గోవర్ధన్..మాన్‌సూన్ రెగెట్టా ట్రోఫీతో పాటు ఎస్ హెచ్ బాబు ట్రోఫీ, స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో మాన్‌సూన్ రెగెట్టాలో ట్రిపుల్ ధమాకా పూర్తి చేశాడు. మరోవైపు ఆకాశ్(మైసూర్), రిజ్వాన్ మహమ్మద్(తెలంగాణ) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. అండర్-18 విభాగంలో ఉత్తమ సింగిల్ హ్యాండర్ ఐఎల్‌సీఏ 4 బాలికల ట్రోఫీని అలియా సబ్రీన్(ఒడిశా), అక్షత్(మధ్యప్రదేశ్) దక్కించుకున్నారు. 420 అంతర్జాతీయ ఓపెన్ విభాగంలో రాష్ట్రానికి చెందిన తనూజ కామేశ్వర్, గణేశ్ జోడీ పసిడి పతక ఖాతాలో వేసుకుంది.

గురి తప్పొద్దు..

భారత షూటర్లపై భారీ ఆశలు • 21 మందితో ఒలింపిక్స్ బరిలో

షూటింగ్..ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ భారీ ఆశలు పెట్టుకున్న క్రీడాంశం. చెక్కుచెదరని గురితో ప్రత్యర్థులకు దీటుగా సవాలు విసురుతూ ముందుకు సాగే షూటింగ్‌లో పతక వేట అంత సులువేం కాదు. రెప్పపాటు వ్యవధిలో ఫలితం తారుమారయ్యే అవకాశాలు ఎక్కువ. శారీరక శ్రమకు తోడు మానసిక సంసిద్ధత కీలకమైన షూటింగ్‌లో ప్రతీ పాయింట్ పతక విజేతను నిర్ణయించేదే. గత(టోక్యో) ఒలింపిక్స్ చేదు అనుభవాలను చెరిపేస్తూ పారిస్‌లో పతకాలు కొల్లగొట్టాలని భారత షూటర్లు పట్టుదలతో ఉన్నారు. 21 మంది భారీ బలగంతో బరిలోకి దిగుతున్న భారత్.. చరిత్ర తిరుగురాయాలని చూస్తున్నది. విశ్వక్రీడల షూటింగ్‌లో మన పతక అవకాశాలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం.

(నమస్తే తెలంగాణ క్రీడా విభాగం):

ఒలింపిక్స్‌లో షూటింగ్‌కు ప్రత్యేక స్థానం. ప్రపంచ స్థాయి అత్యుత్తమ షూటర్లతో పోటీపడుతూ పతకం సాధించడం మామూలు విషయం కాదు. ప్రపంచ చాంపియన్‌షిప్, ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో పతకాలు సాధించినా..ఒలింపిక్స్‌లో ఉండే ఆ పోటీనే వేరు. అంచనాలు లేకుండా బరిలోకి దిగుతూ పతకాలు ఖాతాలో వేసుకునే వారే ఎక్కువ. అయితే ఇది భారత్ విషయంలో పూర్తి విరుద్ధంగా సాగుతున్నది. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగి రిక్తహస్తాలతో వెనుదిరిగిన వారే మనకు ఎక్కువ. సరిగ్గా మూడేండ్ల క్రితం టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో 18 మందితో భారత షూటింగ్ బృందం కనీసం ఒక్క పతకం సాధించకుండానే స్వదేశానికి భారంగా చేరుకుంది. ఇందులో అందరూ మంచి పేరున్న షూటర్లే. కానీ లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకునే లోపే జరుగాల్సిన నష్టం కాస్తా జరిగిపోయింది. కానీ టోక్యోలో జరిగిన తప్పునే తిరిగి చేసే ఉద్దేశం లేని జాతీయ రైఫిల్ సమాఖ్య(ఎన్ఆర్ఏఐ) సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. అప్పటి వరకు తమ స్థానాలకు ఢోకా లేదనుకున్న కోచ్‌లను పక్కకు తప్పించింది. దీనికి తోడు భారీ అంచనాల మధ్య పోటీకి దిగి ఒత్తిడికి చిత్తయిన షూటర్లను వాస్తవ రూపం ఏంటో తెలిసి వచ్చేలా చేశారు. సౌరభ్ చౌదరీ, అభిషేక్ వర్మ, అపూర్వి చండేలా, రహీ సర్నోబత్ లాంటి వారు ఈ కోవలోకే వస్తారు. వీరిని ఒక రకంగా పక్కకు తప్పిస్తూ సిఫ్ట్ కౌర్ సమ్రా, సరబ్‌జ్యోత్‌సింగ్ లాంటి మెరికల్లాంటి షూటర్లకు అండగా నిలువడంతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఇక మీడియా హైప్‌తో ఎక్కడికో వెళ్లిపోయిన స్టార్ మను భాకర్ తిరిగి స్వల్ప కాలంలోనే యథా స్థానానికి వచ్చింది. ఇలా ప్రతీ అంశంలోనే జాగ్రత్తలు తీసుకుంటూ షూటర్లను ఎంపిక చేశారు. ఈ క్రమంలో ప్రతిభ, ప్రదర్శనను ఆధారంగా చేసుకుంటూ పైరేవీలకు ఆస్కారం లేకుండా ఈసారి ఒలింపిక్స్‌కు షూటర్లను ఎంచుకున్నారు. దీనికి తోడు విశ్వక్రీడల సన్నద్ధత కోసం కేంద్ర క్రీడాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

చైనా, రష్యా నుంచే పోటీ:

పారిస్ ఒలింపిక్స్‌లో ముఖ్యంగా చైనా, రష్యా షూటర్ల నుంచే భారత్‌కు కఠిన పోటీ ఎదురయ్యే అవకాశముంది. చైనాకు చెందిన షెంగ్ లివో, డు లిన్షు, జాంగ్ బోవెన్, జింగ్ రాక్సిన్ లాంటి షూటర్లు భారత్‌కు ప్రతిబంధకంగా నిలువనున్నారు. మరోవైపు ఉక్రెయిన్‌పై యుద్ధంతో వేటు ఎదుర్కొంటున్న రష్యా షూటర్ల నుంచి భారత్‌కు తీవ్ర పోటీ పొంచి ఉంది.

ఒలింపిక్స్ షూటింగ్‌లో పతకాలు

రాజ్‌వర్ధన్‌సింగ్ రాథోడ్:	రజతం (2004)
అభినవ్‌బింద్రా:	స్వర్ణం (2008)
గగన్ నారంగ్:	కాంస్యం(2012)
విజయ్‌కుమార్:	రజతం (2012)

ఇషా, సిఫ్ట్‌కౌర్‌పై ఆశలు

పారిస్ ఒలింపిక్స్‌లో హైదరాబాదీ యువ షూటర్ ఇషాసింగ్, సిఫ్ట్‌కౌర్ సమ్రాపై భారీ అంచనాలు ఉన్నాయి. గత కొన్నాళ్లుగా ఇషా అంచనాలకు మించి రాణిస్తున్నది. ప్రపంచ చాంపియన్‌షిప్, వరల్డ్‌కప్, ఆసియాగేమ్స్ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఇషా ఇరుగదీస్తున్నది. తొలిసారి విశ్వక్రీడల్లో పోటీపడుతున్న ఇషా..పతకంతో తిరిగిరావాలని పట్టుదలతో ఉంది. 25మీటర్ల వ్యక్తిగత పిస్టల్ విభాగంలో ఈ హైదరాబాదీ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. మరోవైపు సిఫ్ట్ కౌర్‌పై కచ్చితంగా పతకం గెలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

PARIS 2024 — 5 రోజుల్లో

సహాయక కోచ్‌లుగా అభిషేక్, డోస్చెటె!

న్యూఢిల్లీ: శ్రీలంకతో త్వరలో మొదలుకానున్న పరిమిత ఓవర్ల సిరీస్ కోసం భారత జట్టుకు అభిషేక్‌నాయర్, ర్యాన్‌టెన్ డోస్చెటె సహాయక కోచ్‌లుగా వ్యవహరించే అవకాశముంది. రాహుల్ ద్రవిడ్ స్థానంలో చీఫ్ కోచ్‌గా ఎంపికైన గౌతం గంభీర్‌తో కలిసి అభిషేక్, డోస్చెటె పనిచేయనున్నారు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ తరపున సేవలందించిన ఈ ముగ్గురు టీమ్‌ఇండియాకు కోచ్‌లుగా కొనసాగే చాన్స్ కనిపిస్తున్నది. జాతీయ జట్టుకు మూడు వన్డేలాడిన నాయర్‌కు కోచింగ్ విషయంలో మెరుగైన అనుభవముంది. దీనికి తోడు దినేశ్‌కార్తీక్, రింకూసింగ్‌కు మానసిక సన్నద్ధత విషయంలో నాయర్ సహాయపడ్డాడు. మరోవైపు దిలీప్‌ను తిరిగి ఫీల్డింగ్ కోచ్‌గా కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీమ్‌ఇండియా మూడు టీ20లకు తోడు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది.

భారత ఫుట్‌బాల్ కోచ్‌గా మార్వ్కెజ్

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ నూతన కోచ్‌గా స్పెయిన్‌కు చెందిన మనాలో మార్వ్కెజ్ ఎంపికయ్యాడు. ఇగోర్ స్టిమాక్ వివాదాస్పద నిష్క్రమణ తర్వాత అతని స్థానాన్ని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్ఎఫ్)..మార్వ్కెజ్‌తో భర్తీ చేసింది. ప్రస్తుతం గోవా ఎఫ్‌సీ కోచ్‌గా కొనసాగుతున్న మార్వ్కెజ్‌కు ఫుట్‌బాల్ కోచింగ్‌లో అపార అనుభవముంది. శనివారం సమావేశమైన ఏఐఎఫ్ఎఫ్ మార్వ్కెజ్‌ను కొత్త కోచ్‌గా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.